క్లుప్తంగా

నీటి సరఫరా బంద్ నేడు

అగనంపూడి: జీవీఎంసీ జోన్–6 పరిధిలోని సిద్ధార్థనగర్ 12ఎంఎల్‌డీ నీటి శుద్ధి కార్మాగారం ఫిల్టర్ల బ్లేడ్లు, క్లారిఫయర్లు, సంపులు శుభ్రం చేసే పనులు మంగళవారం చేపట్టనున్న కారణంగా నీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అసిస్టెంట్ ఇంజనీర్ బదిరీనాథ్ తెలిపారు. ఈ కారణంగా 86, 87 వార్డుల్లోని ప్రాంతాలకు మంగళవారం నీటి సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

దివ్యాంగురాలికి వితరణ



దివ్యాంగురాలి కుటుంబానికి సరకులు అందిస్తున్న కార్మికులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ బ్యాటరీ ఫోర్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడు బలిరెడ్డి శ్రీను ఇటీవల ప్రమాదానికి గురవడంతో అదే విభాగానికి చెందిన కార్మికులు ఆ కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందించారు. శ్రీను ఔదార్యంతో ఆ సరకులను అదే గ్రామంలోని నిరుపేద దివ్యాంగురాలి కుటుంబానికి అందించారు. గ్రామ పెద్దలు పట్టా రామ అప్పారావు, గుదే సుశీలా గజేంద్రరావు, బలిరెడ్డి సత్యనారాయణ శ్రీనును అభినందించారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ కాంట్రాక్ట్ కార్మికుల అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.సన్యాసిరెడ్డి, కోన రమణ, నమ్మి దేముడు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ



యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోనల్ పారిశుధ్య కార్మికులకు సోమవారం యూనిఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాజువాక జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పురుషులకు ఖాకీ ప్యాంట్లు, తవ్వాళ్లు, షర్టులు, మహిళలకు చీరలను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శేషాద్రి, సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, కార్పొరేటర్లు రాజాన రామారావు, భూపతిరాజు సుజాత, గంధం శ్రీనివాసరావు, లేళ్ల కోటేశ్వరరావు, రౌతు శ్రీనివాసరావు, శానిటరీ సూపర్‌వైజర్ బి.వి.రామరావు, పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షునికి అవార్డు



మెడల్ అందుకుంటున్న మురళీరెడ్డి

అగనంపూడి: లయన్స్‌క్లబ్ కూర్మన్నపాలెం అధ్యక్షుడు ఎ.మురళీరెడ్డి సేవలను గుర్తించిన లయన్స్‌క్లబ్ లయన్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ మెడల్‌ను అందించింది. ఈ మేరకు నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో మురళీరెడ్డికి అవార్డుతో పాటు సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. కూర్మన్నపాలెం అధ్యక్షునిగా 50 మంది సభ్యలను చేర్చడంతో ఈయనకు ఈ అవార్డు దక్కింది. కూర్మన్నపాలెం క్లబ్ నుంచి కె.వి.సుబ్బరాజును 2వ ఉప జిల్లా గవర్నర్‌గా నియమించారు.

కేజీహెచ్ ఏడీకి పదోన్నతి

మహారాణిపేట: కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ (పరిపాలన) సీహెచ్.శ్రీనివాస్ కుమార్‌కు పదోన్నతి లభించింది. శ్రీకాకుళం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డిప్యూటీ డైరెక్టర్ (పరిపాలన)గా నియమించారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2022 మార్చి 30నుంచి కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

పండగ వేళ.. పప్పన్నమూ కష్టమే..

- రేషన్ దుకాణాల్లో బియ్యం, పంచదార మాత్రమే సరఫరా
- కందిపప్పు, గోధుమపిండి ఊసే లేదు
- బయటి మార్కెట్‌లో ధరలకు రెక్కలు
- పేద, మధ్యతరగతి వారికి అవస్థలు



రేషన్ ఇస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ: పేద, మధ్యతరగతి వారికి పండగ పూట పప్పన్నమూ కష్టమే అన్నట్లుగా ఉంది పరిస్థితి. బయటి మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ఉప్పు నుంచి పప్పుల వరకు ధరలు ఆకాశాన్నంటాయి. ధరలను అదుపు చేస్తామని, నిత్యావసర సరకులను రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేస్తామని ప్రకటనలు గుప్పించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని అమలు చేయడంలో విఫలం కావడంతో ప్రజలపై భారం పెరిగిపోయింది. పరిస్థితి ఇలా ఉంటే ఏం కొంటాం.. ఏం తింటామంటూ వారంతా నిట్టూరుస్తున్నారు.

రేషన్ దుకాణాలను పటిష్టం చేస్తామని..

ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రేషన్ దుకాణాలను పటిష్టం చేస్తామని ప్రకటించారు. ఉప్పు నుంచి పప్పు వరకు తక్కువ ధరకే నిత్యావసర సరుకులను అందిస్తామని హామీలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ఆ దిశగా చర్యలు మాత్రం కానరావడం లేదు. రేషన్ దుకాణాల్లో కందిపప్పు కాదు ఏ సరకూ సక్రమంగా ఇస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. రేషన్ దుకాణాల్లో బియ్యం, పంచదార మాత్రమే సరఫరా చేస్తున్నారు. అధికారంలోకి వస్తే తొలుత కందిపప్పును రాయితీపై అందిస్తామని చంద్రబాబు ప్రకటించారు. దశల వారీగా పామాయిల్, గోధుమపిండి తదితర సరుకులు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు వంటనూనె, గోధుమ పిండి పంపిణీని పక్కన పెడితే కందిపప్పును మాత్రం అరకొరగా అందిస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు. గత ప్రభుత్వం హయాంలో ధరలు పెరిగినప్పుడు పేదలకు సాంత్వన చేకూర్చేందుకు రైతు బజార్లు, రేషన్ డిపోల్లో రాయితీపై వంటనూనెలు, కందిపప్పు, శనగపప్పు పంపిణీ చేసే వారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఇటువంటి చర్యలు కనిపించడం లేదని ప్రజలు నిట్టూరుస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ధరలు పెరిగినపుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కిలో కంది పప్పును రూ.67కే అందించారు. బహిరంగ మార్కెట్లో సన్న బియ్యం ధర కిలో రూ.60లోపే ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకునేది. నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలపై ఎప్పటికప్పుడు మంత్రివర్గం సమీక్షలు నిర్వహించేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పప్పులు, బియ్యం, వంటనూనెలతో పాటు కూరగాయలకు రెక్కలు వచ్చాయి. ఈ ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని పలువురు విమర్శిస్తున్నారు.

ఎప్పుడు అడిగినా వచ్చే నెల అంటున్నారు



కంది పప్పు గురించి మూడు నెలలుగా అడుగుతుంటే వచ్చే నెల ఇస్తామంటూ రేషన్ పంపిణీదారులు చెబుతున్నారు. బయట మార్కెట్లో కిలో కంది పప్పు రూ.200 ఉంది. మాలాంటివాళ్లం కొనలేక ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం రూ.67కే కందిపప్పు ఇస్తామని చెబుతోంది, కానీ ఇవ్వడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా రూ.67కే కంది పప్పు ఇచ్చేవారు. ప్రభుత్వం స్పందించి, రేషన్ దుకాణాల ద్వారా సరకులు పంపిణీ చేయాలి

– కె.నూకరత్నం, పెదగంట్యాడ

అయిపోయిందని చెబుతున్నారు..



రేషన్ దుకాణాల్లో కంది పప్పు అడిగితే అయిపోయిందని చెబుతున్నారు. గత మూడు నెలల నుంచి కంది పప్పు ఇవ్వలేదు. ఈ నెల అడిగితే 1100 కార్డులకు 50 నుంచి 100 ప్యాకెట్లు మాత్రమే వచ్చాయని, మొదటి రోజే పంపిణీ చేసేశామని చెబుతున్నారు. ఇలా అయితే ఎలా? అందరికీ సరఫరా చేయాలి కదా.

–పి.అన్నపూర్ణ, నడుపూరు

ప్రతి లబ్ధిదారునికీ అందేలా చూస్తాం

రేషన్ డిపోల ద్వారా ప్రతి ఇంటికీ రాయితీపై కందిపప్పు అందజేయడానికి కృషి చేస్తున్నాం. ఇప్పటి వరకు వచ్చిన కందిపప్పును పంపిణీ చేశాం. 1000 కార్డులు ఉన్న డిపోలకు 100 కిలోలు, 1000 కార్డులకు పైగా ఉన్న డిపోలకు 150 కిలోలు సరఫరా చేశాం. జాయింట్ కలెక్టర్, డీఎస్‌వోల ఆదేశానుసారం మిగిలిన వారికి కూడా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ నెల 2న ఏడున్నర టన్నులు కంది పప్పును సరఫరా చేశాం. ఈ నెల 4న 10 టన్నుల వరకూ కంది పప్పు వచ్చింది. దానిని ప్రతి లబ్ధిదారునికీ అందించేలా వాహనాలను మళ్లీ పంపిస్తాం.

– తవ్వా కృష్ణ, ఏఎస్‌వో, సర్కిల్–3

డ్రైనేజీల్లో పూడికల తొలగింపు



75వ వార్డులో కాలువల్లో మట్టి తీయిస్తున్న ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్

పెదగంట్యాడ: రహదారులు, కాలువల్లో చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ ఆదేశించారు. 75వ వార్డు పరిధి పోలీస్ అవుట్ పోస్ట్ సమీపంలో కాలువల్లోని పూడికలను సోమవారం ఆయన దగ్గరుండి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి కాలువలను శుభ్రం చేయడం లేదని తమకు ఫిర్యాదు అందడంతో ఈ పనులు చేపట్టామన్నారు. ప్రజలు ఇళ్లలోని చెత్తను ఇళ్ల వద్దకు వచ్చే జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని కోరారు. ఇలా రోడ్లపై, కాలువల్లో చెత్త వేయడం వల్ల మురుగు పేరుకుపోవడంతో పాటు దోమలు వృద్ధి చెంది రోగాలు వ్యాప్తి చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ విషయంలో ప్రజలు సహకరించాలని కోరారు.

హైస్కూల్ రోడ్‌లో భారీ అన్న సమారాధన



అన్న సమారాధనను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి



69వ వార్డు శివాలయం వద్ద..

గాజువాక: ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాజువాక హైస్కూల్ రోడ్‌లో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. 8 వేల మంది భక్తులు అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు పల్లా చినతల్లి, పల్లా పెంటారావు, స్థానిక నాయకులు, నిర్వాహకులు మితాన రెడ్డి, రామలక్ష్మి, అచ్చంనాయుడు, మహేష్, రవి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

69వ వార్డులో..

అక్కిరెడ్డిపాలెం: 69వ వార్డు కాపు తుంగ్లాంలో శివాలయం వద్ద కమిటీ ప్రతినిధులు అన్న సమారాధన నిర్వహించారు. 6 వేల మందికి పైగా భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు

గాజువాక: భాగవతుల ఛారిటబుల్ ట్రస్టు, టెక్ మహీంద్ర ఫౌండేషన్ సంయుక్తంగా ఉపాధి కోర్సుల్లో యువతకు ఉచిత శిక్షణ నిర్వహించనున్నట్టు ట్రస్టు కార్యదర్శి భాగవతుల శ్రీరామ్మూర్తి తెలిపారు. ఇంటర్, డిగ్రీ పూర్తయిన 18 నుంచి 28 ఏళ్ల వయసు గల యువతీ యువకులు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇంటర్‌నెట్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ రెడీనెస్, ఐటీఈఎస్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, బీఎఫ్ఎస్ఐ, సీఆర్ఎస్ కోర్సుల్లో మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు గాజువాకలోని భాగవతుల ఛారిటబుల్ ట్రస్టు, టెక్ మహీంద్ర స్మార్ట్ సెంటర్‌ను గాని, 6309956383 నంబర్‌లో గాని సంప్రదించవచ్చన్నారు.

మానవతా సేవా సంస్థ కొత్త యూనిట్ల ఏర్పాటు

గాజువాక: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవల విస్తరణలో భాగంగా కొత్త యూనిట్లను ఏర్పాటు చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు మాట్లాడుతూ గాజువాకలో మూడేళ్ల క్రితం ప్రారంభమైన సంస్థ కార్యకలాపాలను విస్తరించామని.. అనకాపల్లి, అడ్డురోడ్, మాధవధార, ఇండస్ట్రియల్ ఏరియా, గాజువాక, కూర్మన్నపాలెం, స్టీల్‌ప్లాంట్, కొత్తవలస, పాయకరావుపేట యూనిట్లను ఏర్పాటు చేశామని తెలిపారు. గాజువాక మానవతా యూనిట్ చైర్మన్‌గా సుంకర నారాయణ ప్రసాద్, అధ్యక్షుడిగా వెన్నల ఈశ్వరరావు ప్రమాణం చేశారు. కార్యక్రమంలో వివిధ యూనిట్ల ప్రతినిధులు ఎన్.రామచంద్రారెడ్డి, ఎం.ఎల్.ఎన్.కె.అచ్యుతరావు, రాధా పుష్పవతి, జానకి రామరాజు, బి.సత్యనారాయణ, రామాంజనేయరెడ్డి, బలివాడ సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికనేత గయాసింగ్‌కు నివాళి



స్టీల్ ఏఐటీయూసీ కార్యాలయంలో గయాసింగ్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

ఉక్కునగరం: కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన యోధుడు గయాసింగ్ అని స్టీల్ ఏఐటీయూసీ నేతలు కొనియాడారు. ఏఐటీయూసీ జాతీయ నాయకుడు గయాసింగ్ 7వ వర్ధంతి సందర్భంగా స్టీల్ ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కార్మికుల ఆర్థిక ప్రయోజనాలు సాధించడంలో ఆయన చేసిన కృషి మరువరానిదన్నారు. కార్యక్రమంలో స్టీల్ ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఎస్.ఎన్. రావు, డి.ఆదినారాయణ, కె.రాజబాబు, తాండ్ర కనకరాజు, జి.జయ, డొక్క నర్సింగరావు, జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

‘హైమాస్ట్’కు తుప్పు



అడుగా భాగాన తుప్పు పట్టి విరిగిపోవడానికి సిద్ధంగా ఉన్న హైమాస్ట్ లైట్ల స్తంభం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి సెక్టార్–3 దిబ్బపాలెంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్ స్తంభం కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. ఇనుప స్తంభాలకు హైమాస్ట్ లైట్లు అమర్చారు. స్తంభం గేజ్ తక్కువగా ఉండడంతో కింది భాగం తుప్పు పట్టి విరిగిపోయే పరిస్థితి ఏర్పడింది. స్తంభం ఎత్తులో ఉండడంతో ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ స్తంభం వద్దకు నిత్యం అనేక మంది చేరి ఆటలు, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఆ సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి, వాటిని తొలగించి కొత్తవి అమర్చాలని కోరుతున్నారు.

అగ్నిగుండం తొక్కిన భవానీ మాలధారులు



ధర్మాల వీధిలో అగ్నిగుండం తొక్కుతున్న భవానీ మాలధారులు

పెదగంట్యాడ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 75వ వార్డు ధర్మాల వీధిలో సోమవారం రాత్రి భవానీ మాలధారులు అగ్నిగుండం తొక్కారు. పెంటమాంబ యువజన సేవా సంఘం సభ్యులు ధర్మా, సంతోష్ రెడ్డి, అచ్చిబాబు, గిరి, వంశీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద విశేష పూజలు చేశారు. అగ్నిగుండం తొక్కే సమయంలో అమ్మవారి నామ స్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి.

టిడ్కో లబ్ధిదారుల ఆందోళన



దయాల్‌నగర్‌లో ఆందోళన చేస్తున్న టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు

పెదగంట్యాడ: టిడ్కో ఇళ్లు అందజేయాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. దయాల్ నగర్ వద్ద నిర్మించిన ఇళ్ల వద్ద సోమవారం ధర్నా చేశారు. ఆపై బీసీ రోడ్డు మీదుగా చలో కలెక్టరేట్ అంటూ జిల్లా కలెక్టర్ కార్యాలయాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లు మంజూరు చేసిందని, ఆ ఇళ్లకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అనుగుణంగా ముందుగా రూ.25వేలు వంతున డీడీలు చెల్లించామని తెలిపారు. సుమారు ఎనిమిదేళ్లు గడిచినా తమకు ఇళ్లు పంపిణీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కట్టిన ఇళ్లు మంజూరు చేయకపోయినా బ్యాంక్ రుణాలు కట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వైపు ఇంటి అద్దెలు చెల్లించలేక అవస్థలు పడుతుంటే, మరోవైపు బ్యాంక్ రుణాలు కట్టాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు.

గత నెల 23న పెదగంట్యాడ పీహెచ్‌సీ వద్ద జోన్–6 జోనల్ కమిషనర్ శేషాద్రిని కలిసి వినతి పత్రం అందజేశామని, స్పందించిన ఆయన అదే నెల 26 తర్వాత తాను స్వయంగా వచ్చి పరిశీలిస్తానని, లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని చెప్పారని వివరించారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి పరిశీలన చేయలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి తమకు కేటాయించిన ఇళ్లను పూర్తి సదుపాయాలతో అందజేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మృతుని కుటుంబానికి చేయూత



మృతుని కుటుంబానికి సరకులు ఇస్తున్న సంఘం ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమడకకు చెందిన శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘం బంగారమ్మ గుడి సమీపంలో నివాసముంటున్న మృతుని కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందించింది. పెయింటింగ్ పనులు చేసుకుంటూ అండమాన్ కొండయ్యవలస ప్రాంతంలో నివాసముంటున్న లుకలాపు కృష్ణ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో స్పందించిన పద్మ మార్కండేయ సేవా సంఘం నెలరోజులకు సరిపడా బియ్యం ఇతర నిత్యావసర సరకులు అందించింది. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు కొలిపాక అప్పారావు, ప్రతినిధులు గందోళి పైడికొండ, బేతా హనుమంతురావు, దొడ్డి దేముడు, నరసింగరావు, వెంకటరమణ, గుదే అప్పలరాజు పాల్గొన్నారు.

లలితా త్రిపుర సుందరిగా శ్రీమహాదుర్గ



లలితా త్రిపుర సుందరిగా శ్రీమహాదుర్గ



గజలక్ష్మి అవతారంలో శ్రీమహాలక్ష్మి



జగద్విఖ్యాతగా శ్రీమహా సరస్వతి



మహా చండీదేవిగా దుర్గాలమ్మ

ఉక్కునగరం: శరన్నవరాత్రి ఉత్సవ వేళ దుర్గామాత ప్రత్యేక రూపాల్లో పూజలందుకుంటున్నారు. శ్రీమహాదుర్గ, శ్రీమహాలక్ష్మి, శ్రీమహాసరస్వతి అమ్మవార్లు ఒకే మంటపంలో వెలిసిన అరుదైన ఉక్కునగరం త్రిశక్తి దేవాలయంలో శరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఐదో రోజు సోమవారం శ్రీమహాదుర్గ అమ్మవారు గులాబీ వర్ణం చీరలో లలితా త్రిపుర సుందరి అవతారంలో, శ్రీమహాలక్ష్మి అమ్మవారు ఆకుపచ్చ వర్ణం చీరలో గజలక్ష్మిగా, శ్రీమహాసరస్వతి అమ్మవారు ముదురు ఎరుపు వర్ణం చీరలో జగద్విఖ్యాతగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణిశర్మ నేతృత్వంలో ఉదయం అమ్మవార్లకు తామర పుష్పార్చన చేశారు. చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం మహిళలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మహా చండీదేవిగా దుర్గాలమ్మ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలోని దుర్గాలమ్మ మహా చండీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అగనంపూడి పరిసర నిర్వాసిత కాలనీల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు జరిపించారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి లలిత, విష్ణు సహస్ర పారాయణం గావించింది. ఈ సందర్భంగా పారాయణం పఠిస్తున్న పారాయణ బృందానికి లక్కీడిప్ ద్వారా చీరలు బహుకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్, కనకరాజు, గొల్లవిల్లి రామారావు పాల్గొన్నారు.

షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదానికి గురైన ఫ్యాషన్ షాపింగ్ మాల్

అక్కిరెడ్డిపాలెం: గాజువాకలోని లక్ష్మీకాంత్ థియేటర్ ఎదురుగా గల లివిష్ ఏ1 ఫ్యాషన్ షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ఆదివారం అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు పెదగంట్యాడ ఏడీఎఫ్‌వో ఎన్.గోపీకృష్ణ తెలిపారు. సుమారు రూ.20 లక్షల ఆస్తిని నష్టం వాటిల్లకుండా కాపాడమన్నారు. అర్ధరాత్రి సమయంలో షాపింగ్ మాల్ యజమాని జి.ప్రమీల అగ్ని ప్రమాదంపై సమాచారం అందజేశారన్నారు. సమాచారం అందుకున్న వెంటనే తమ సిబ్బంది ఎల్ఎఫ్ ఎం.సోమినాయుడు, డ్రైవర్ ఆపరేటర్ జి.రమేష్, ఫైర్‌మెన్‌లు ఆర్.నాయుడు, ఎస్.రాజేష్, హెచ్‌డీ జే.శ్రీనివాసరావులతో కూడిన బృందంతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగిందని తెలిపారు. ప్రమాదంలో ఫర్నిచర్, సీలింగ్, ఎలక్ట్రికల్ వైరింగ్, టోటల్ గ్రోసరీస్, కంప్యూటర్స్, ఎయిర్ కండిషన్, వంటివి పూర్తిగా దగ్ధమయ్యాయన్నారు.







• అల్లుకున్న నిర్లక్ష్యం

జీవీఎంసీ 86వ వార్డు కూర్మన్నపాలెం రావుల చెరువు వాకింగ్ ట్రాక్ వద్ద చెట్ల కొమ్మలు, ముళ్లపొదలు గుబురుగా పెరిగిపోయాయి. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి, చెట్లు నాటారు. అయితే నిర్వహణ లోపంతో చెట్లతో పాటు ముళ్ల పొదలు, పిచ్చిమొక్కల పొదలు గుబురుగా పెరిగి విద్యుత్ స్తంభాలకు అల్లుకోవడంతో ప్రమాదం పొంచి ఉంది. చాలా చోట్ల విద్యుత్ స్తంభాలతో పాటు వైర్లకు కూడా పొదలు అల్లుకొని ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాకర్స్ ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పొదలను తొలగించాలని కోరుతున్నారు. - అగనంపూడి